
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 18 । జూలై । 2025



సాయిబాబాకు పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 560.70 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శివాలయం ఈఓగా గోపి

తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా నామని గోపి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తుళ్లూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా పని చేస్తూ బదిలీపై మంగళగిరి వచ్చారు. ఆయనకు అభినందనలు తెలిపారు.



న్యూస్‌రీల్

బగళాముఖి ఆలయ హుండీ ఆదాయం రూ.6,09,886



కర్లపాలెం: చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.6,09,886 వచ్చినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. గురువారం బాపట్ల డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, చందోలు ఎస్‌ఐ ఎంవి శివకుమార్‌యాదవ్ పర్యవేక్షణలో పొన్నూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బందితోపాటు అమ్మవారి భక్తులు హుండీ నగదు లెక్కించారు. ప్రతి మూడు నెలలకు అమ్మవారి హుండీ నగదు లెక్కిస్తున్నామని గతంకంటే అమ్మవారి హుండీ ఆదాయం ఎక్కువగా ఉందని ఈవో తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



పెదకాకాని: శివాలయంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానములో మూడు రోజుల పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం అర్చకులు, వేదపండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో ఇవి జరిగాయి. ఈ పవిత్రోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఉదయం అన్నదానం, సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, అర్చకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.


గిరిజా కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం గిరిజా కళ్యాణ పోస్టర్‌ను వైశ్యకుల గురువు వామనాశ్రమ మహా స్వామీజీ ఆవిష్కరించారు. ఈ నెల పది నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు చాతుర్మాస దీక్షలో భాగంగా 27న గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు చాతుర్మాస సేవా సమితి కన్వీనర్ తటవర్తి రాంబాబు తెలిపారు. కల్యాణంలో పాల్గొనేందుకు 94406 05773 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో గుడివాడ రవి, జుజ్జూరు శ్రీనివాసరావు, బాపారావు, కోటా శేషగిరి, మహంకాళి శ్రీనివాసరావు, సునీత, త్రిపురమల్లు వాణి పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు నిలుపుదల

రూ.85.52 విలువైన ఉత్పత్తులపై అధికారుల చర్యలు



కొరిటిపాడు: జిల్లాలోని గుంటూరు నగరం, తెనాలి, ప్రత్తిపాడులో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ దుకాణాల్లో రెండు బృందాలుగా సోదాలు చేశారు. ఎనిమిది దుకాణాల్లో రూ.57.11 లక్షల విలువైన 318.67 టన్నుల ఎరువులు, 11 దుకాణాల్లో రూ.19.83 లక్షల ఖరీదు చేసే 6,630 లీటర్ల పురుగు మందులు, ఐదు దుకాణాల్లో రూ.8.58 లక్షల విలువైన 1,278 మెట్రిక్ టన్నుల విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో గుంటూరు వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు, ఏడీఏలు పి.మురళీకృష్ణ (పశ్చిమ గోదావరి), ఎం.సునీల్ (గన్నవరం), విజిలెన్స్ సీఐలు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ రవిబాబు, వ్యవసాయ అధికారులు సునీల్‌కుమార్ (ఒంగోలు), బి.కిషోర్ కుమార్ (గుంటూరు రూరల్) పాల్గొన్నారు.

నిన్న.. "నమ్మి పార్టీలో చేరితే ఇక్కడ కూడా తనకు పరాభవమే ఎదురైంది.. ఎంత కష్టపడి పనిచేసినా అన్యాయమే జరిగింది.. ఇటువంటి రాజకీయాలు తానెప్పుడూ చూడలేదు... రాజకీయాల నుంచి తప్పుకుంటూ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నా''..అంటూ పట్టణ 19వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య (ఉల్లిపాయల సుబ్బయ్య) చేసిన వ్యాఖ్యలు చేశారు.

నేడు.. బుధవారం తాను(సుబ్బయ్య) చేసిన వ్యాఖ్యలు అన్నీ మర్చిపోయి గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రాత్రికి రాత్రి ఏం జరిగిందో తెలియదు. తెల్లవారేసరికి అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెరవెనుక రాజకీయం బాగానే పనిచేసిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

తుస్సుమన్న ఉల్లిపాయ బాంబు

- నిన్న గగ్గోలు.. నేడు వైస్ చైర్మన్‌గా పగ్గాలు
- చీరాలలో హాట్ టాపిక్‌గా మారిన కౌన్సిలర్ సుబ్బయ్య వ్యవహారం



వైస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న పొత్తూరి సుబ్బయ్య

చీరాల: చీరాల మున్సిపల్ కౌన్సిల్‌లో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌గా ఉన్న పొత్తూరి సుబ్బయ్య చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీ కండువా వేసుకున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు ఎన్నికల అనంతరం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి వరకు కౌన్సిల్‌లో బలం లేని టీడీపీ క్రమేణా పుంజుకుంది. టీడీపీకి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కూడా మద్దతు పలకడంతో చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం చేశారు. మే 14న అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో బుధవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ అభ్యర్థి ఎంపిక విషయంలో మించాల సాంబశివరావు, పొత్తూరి సుబ్బయ్య పేర్లు బలంగా వినిపించాయి. కుల సమీకరణాలు, ఓటు బ్యాంకు ఆధారంగా చైర్మన్‌గా తననే ఎంపిక చేస్తారని ఆయన ఎంతో ఆశపడ్డారు. గత రెండు పర్యాయాలు చేజారిపోయిన అవకాశాన్ని ఈసారైనా దక్కించుకునేందుకు ఎంతో కష్టపడ్డాడు. చివరి నిమిషంలో సీల్డ్ కవర్‌లో ఆయన పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురై బయటకు వచ్చి మీడియా ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. నమ్మి పార్టీలో చేరితే తనకు అన్యాయం జరిగిందని, ఆస్తులు అమ్ముకున్నానని, రాజకీయాల్లో ఇమడలేకపోతున్నానని, రాజకీయంగా తాను చచ్చిపోయాయని, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఈ ఘటన చీరాలలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో పార్టీపై వ్యతిరేకత వస్తుందని భావించిన టీడీపీ ఎమ్మెల్యే, ముఖ్యనేతలు ఆయనను బుజ్జగించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అలానే బుధవారం రాత్రి పొత్తూరి సుబ్బయ్య వార్డులోనే కూటమి నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి కె.పార్థసారథి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. రాత్రి ఏం జరిగిందో తెలియదు గాని సుబ్బయ్యను బుజ్జగించడంలో వారు సఫలీకృతులయ్యారని సమాచారం. ఉదయం గగ్గోలు పెట్టిన ఆయన రాత్రి పార్టీ కార్యాలయంలో పార్టీ తనకేమి అన్యాయం చేయలేదని, చైర్మన్ పదవి రాలేదని బాధతో మాట్లాడానని చెప్పిన వీడియో సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ కావడం కొసమెరుపు.

చిరునవ్వుతో కౌన్సిల్‌లో సుబ్బయ్య ప్రత్యక్షం

మున్సిపల్ చైర్మన్ పదవి తనకు రాలేదని ఆవేదనతో కన్నీటితో బయటకు వెళ్లిన ఆయన గురువారం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిల్ హాలులో చిరునవ్వులతో ప్రత్యక్షమయ్యారు. వైస్ చైర్మన్ ఎన్నిక ప్రారంభం కాగానే కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు వైస్ చైర్మన్‌గా పొత్తూరి సుబ్బయ్యను ప్రతిపాదించగా కౌన్సిలర్ మామిడాల రాములు బలపరిచారు. వైస్ చైర్మన్‌గా ఆయన 27 ఓట్లతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొద్ది నెలలు మాత్రమే కౌన్సిలర్ల పదవీకాలం ఉండడంతో చైర్మన్‌గా కాకపోయినా వైస్ చైర్మన్‌గా అయినా ఉండి పదవీ కాంక్షను తీర్చుకునేందుకు అవకాశం లభించడంతో ఆయన ఖుషీ అయ్యారు. బుధవారం హడావిడి చేసిన ఆయన మరుసటి రోజుకు చెట్టాపట్టాలు వేసుకుని కౌన్సిల్‌కు రావడం చూస్తే తెరవెనుక రాజకీయం జరిగిందేమోనని గుసగుసలు వినిపిస్తున్నాయి. చీరాల రాజకీయం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పడం రాజకీయ విశ్లేషకులకు కూడా అంతుచిక్కడం లేదు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పొత్తూరి సుబ్బయ్య ఏకగ్రీవం

చీరాల అర్బన్: చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగ్గా అదే రోజు వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. కోరం లేకపోవడంతో గురువారానికి వాయిదా పడింది. ఎన్నికల అధికారిగా డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు వ్యవహరించారు. ఎన్నిక ప్రారంభం కాగానే కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు వైస్ చైర్మన్‌గా పొత్తూరి సుబ్బయ్య పేరును ప్రతిపాదించగా కౌన్సిలర్ మామిడాల రాములు బలపరిచారు. వైస్ చైర్మన్‌గా ఆయనను 27 ఓట్లతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి ఆయనచే వైస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరై మాట్లాడారు. అనంతరం చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్యలను మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, కౌన్సిలర్లు, విభాగాల అధికారులు అభినందనలు తెలిపి సత్కరించారు.

పారిశుద్ధ్యం నిర్వహణలో బాపట్ల జిల్లాకు అగ్రస్థానం

సమష్టి కృషి ఫలితం: కలెక్టర్


బాపట్ల: పారిశుద్ధ్య కార్యక్రమాలలో బాపట్ల జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ముందు వరుసలో నిలిచిందని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యంపై ప్రణాళిక కార్యాచరణ నివేదికలో బాపట్ల 79 శాతం సాధించిందని ముఖ్య కార్యదర్శి తెలిపారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ బాపట్ల జిల్లా అధికార యంత్రాంగం, సిబ్బంది, ప్రజల సమష్టి కృషి ఫలితంగానే అగ్రస్థానం దక్కిందన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ స్థాయికి వచ్చామని తెలిపారు. ఇప్పటి నుంచి పారిశుద్ధ్యంపై మరింత దృష్టి పెట్టాలని, ప్రజ ల్లో అవగాహన పెంచాలని, సాధించిన స్థాయి ని నిలబెట్టుకుని, ఇంకో మెట్టు పైకి వెళ్లాలని సూచించారు. జిల్లాలో నూరు శాతం స్వచ్ఛ బాపట్ల జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు పూర్తిస్థాయిలో పని చేయాలని కోరారు. జిల్లా లో తడి-పొడి చెత్తను వేరు చేయడం, చెత్త సేకరణ, మురుగు నీటి నిర్వహణ వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోందని, ఇక పూర్తిస్థాయిలో నూటికి నూరు శాతం స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సీఎస్‌సీ సేవల్లో ఏపీకి రెండో స్థానం

యద్దనపూడి: మండలంలోని బోయపాలెంలో గల శ్రీ సాయిగణేష్ సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) సెంటర్‌కు సేవల్లో దేశవ్యాప్తంగా రెండో స్థానం లభించింది. 16వ సీఎస్‌సీ దివస్ వేడుకలు ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిగణేష్ కేంద్రం నిర్వాహకులు, వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు అవార్డును అందుకున్నారు. సీఎస్‌సీ సీఈవో సంజయ్‌కుమార్, రాకేష్ నుంచి ఆయన మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు అభినందనలు తెలిపారు.

బాపట్ల జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

- రేపటి నుంచి అమలు
- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్ల: బాపట్ల జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో శనివారం నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృత ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. శనివారం బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో భారీ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వెయ్యి మంది విద్యార్థులు, మరో వెయ్యి మంది అధికారులు, ప్రజలు పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేస్తారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, క్యారీ బ్యాగులు, స్ట్రాలు వంటి వాటిపై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. వ్యాపారులు, దుకాణదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆయన ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అమ్మినా, కొన్నా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిషేధం జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 25 మండలాల్లో పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు దీర్ఘకాలంగా ఉపయోగపడే వస్తువులను వాడాలని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాడైన ప్లాస్టిక్‌ను సేకరించి రీసైకిల్ చేయాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించడాన్ని ప్రోత్సహించాలని, ప్రత్యామ్నాయంగా అరటి నారు, జనపనార, బాదం ఆకులు, వస్త్రపు సంచులను వాడాలని సూచించారు. డ్వాక్రా మహిళలు, ఎస్.ఎస్.జి. సభ్యుల నుంచి ప్లాస్టిక్ రహిత వస్తువుల తయారీకి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సమగ్ర నిషేధం ద్వారా బాపట్ల జిల్లాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోం

- రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుంది
- కొంతమంది అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు
- అక్రమ కేసులపై పునఃపరిశీలన చేయాలి
- అధికారం శాశ్వతం కాదు
- వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున



ఎస్పీ తుషార్‌డూడీకి వినతిపత్రం ఇచ్చిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, కోన, అశోక్‌బాబు, గణేష్

బాపట్ల టౌన్: వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున అన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులపై పునఃపరిశీలన చేయాలని కోరుతూ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, నియోజకవర్గాల సమన్వయకర్తలు కోన రఘుపతి, వరికూటి అశోక్‌బాబు, ఈవూరి గణేష్‌తోపాటు పలువురు నాయకులతో కలిసి ఎస్పీ తుషార్ డూడీకి గురువారం వినతి పత్రం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ లా అండ్ ఆర్డర్‌కు పూర్తిగా సహకరిస్తుందని, అయితే కొంతమంది అధికారులు నాయకుల మెప్పు పొందేందుకు వన్‌సైడ్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం ఎప్పుడు ఒకరి వద్దనే ఉంటుందని భావించవద్దని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీలో పని చేస్తున్న బలమైన నాయకులు, కార్యకర్తలపై సంబంధంలేని కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. కరోనా సమయంలో 68 మంది రేపల్లె ప్రాంతంలో చనిపోతే మృతదేహాలను ఖననం చేసిన ఒక నాయకుడిపై అక్రమ కేసులు బనాయించటం ఎంత వరకు న్యాయమో వారే ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల అండతో పేట్రేగిపోతున్న కొంత మంది ఆగడాలు తగ్గించుకోవాలని సూచించారు.

అత్యుత్సాహం మానుకోవాలి: కోన

నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు కొంతమంది కిందిస్థాయి పోలీసు అధికారులు మరింత అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పలు కేసులకు సంబంధించి ఏవిధంగా అక్రమ కేసులు బనాయించారనేది స్పష్టంగా వివరించామని తెలిపారు. ఈ విషయాలపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జోగి రాజా, కోకి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

దళిత ఉద్యమాలకు స్ఫూర్తి కారంచేడు



కారంచేడు మృతవీరుల రుధిర క్షేత్రం వద్ద నివాళులర్పిస్తున్న దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు

కారంచేడు మృతవీరుల సంస్మరణ సభలో నేతలు

చీరాలరూరల్: దేశవ్యాప్త దళిత ఉద్యమాలకు కారంచేడు ఉద్యమం స్ఫూర్తి నింపడమే కాక దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని పలువురు దళిత, బహుజన నేతలు, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. కారంచేడు గ్రామంలో మారణకాండకు నేటితో 40 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీలోని కారంచేడు మృతవీరుల రుధిర క్షేత్రం వద్ద సంస్మరణ సభ నిర్వహించి మృతవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్య పోరాటం ఎలాంటిదో.. కారంచేడు ఉద్యమ పోరాటం కూడా అటువంటిదన్నారు. ఈ ఉద్యమం ఎంతోమంది దళితులు నాయకులుగా ఎదగటానికి దోహదపడిందని అన్నారు. వారి ప్రాణ త్యాగాలు మరువలేనివన్నారు. పెత్తందారుల అక్రమాలు, ఆగడాలు, దౌర్జన్యాలను అరికట్టడానికి ఆయుధంగా కారంచేడు ఉద్యమం ఉపయోగపడిందని వక్తలు పేర్కొన్నారు. అంతేకాక మృతవీరుల మరణం ఎంతోమంది సామాజిక ఉద్యమకారులలో స్ఫూర్తిని నింపి ఆత్మగౌరవ ఉద్యమాలు కొనసాగించటానికి కారణభూతమైందన్నారు. కారంచేడు మృతవీరుల రుధిర క్షేత్రాన్ని సందర్శించి వారికి నివాళులర్పించడం పౌరులుగా సామాజిక బాధ్యత అని వారు పేర్కొన్నారు. కారంచేడు ఉద్యమ సీనియర్ నాయకుడు దుడ్డు భాస్కరరావు అధ్యక్షత వహించిన సభలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి, వీకేసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్, బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే ఎల్‌కే రాజారావు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, బైరి నరేష్, తేళ్ల సుబ్బారావు, తేళ్ల లక్ష్మీప్రసాద్, దుడ్డు ఏసు, మున్నంగి లక్ష్మయ్య, గోసాల ఆశీర్వాదం, నీలం నాగేంద్రరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి



మృతులు లూదు మరియన్న, పద్మ

భట్టిప్రోలు: పిడుగుపాటుకు గురై బాపట్ల జిల్లాలో గురువారం ఇద్దరు మృతి చెందారు. భట్టిప్రోలు మండలం ఓలేరు శివారు వెంకటరాజు నగర్‌కు చెందిన గుంటూరు లూదు మరియన్న (70) పొలంలో పనిచేస్తుండగా గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం ఆరంభమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో సమీపంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నాడు. అదే సమయంలో అతడికి అత్యంత సమీపంలో పిడుగు పడింది. పిడుగు ధాటికి గురై మృతి చెందాడు. గమనించిన స్థానికులు వృద్ధుడు మృతిచెందిన విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

మహిళ మృతి

సంతమాగులూరు(అద్దంకి): పిడుగు పాటుకు మహిళ మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వారు పొలాల్లో గేదెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు ధాటికి పద్మ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరణ



నెహ్రూనగర్: సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024–25 పోటీల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు లభించడం ఆనందంగా ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరాం, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రలు అవార్డును స్వీకరించారు. భవిష్యత్తులో గుంటూరు నగరాన్ని దేశంలోనే క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	35,268
అమ్మకాలు	36,922
నిల్వ	7,521

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
341	10,000-13,500
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,700
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 845

కొమ్ములు : 541 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,300	10,511	10,000

కాయలు : 304 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,300	10,290	10,000

మొత్తం అమ్మకాలు : 633.750 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

'సాక్షి' ప్రసారాల నిలిపివేతపై

వైఎస్సార్ సీపీ నిరసన



కార్యాలయం అధికారికి వినతిపత్రం అందిస్తున్న పార్టీ నాయకులు

తెనాలి: సాక్షి చానల్ ప్రసారాల నిలిపివేతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాలతో ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక కేబుల్ చానళ్లలో సాక్షి చానల్‌తో పాటు టీవీ9, ఎన్టీవీ తదితర చానళ్ల ప్రసారాలను నిలిపివేయటం అప్రజాస్వామికం అన్నారు. మీడియా స్వేచ్ఛను హరించటమే కాకుండా, ప్రజలకు వాస్తవాలను తెలియకుండా అడ్డుకోవాలని చూడటమేనని పార్టీ నాయకులు ఆరోపించారు. సూపర్‌సిక్స్ హామీలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన వందల వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసగించటం, పాలనలో వైఫల్యాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించటం వంటి వాస్తవాలను ప్రజాపక్షం వహించి ప్రసారం చేస్తున్న సాక్షి గొంతు నొక్కాలని చూస్తున్నారని విమర్శించారు.

ఒత్తిడి తెచ్చి మరీ...

పార్టీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాయ్‌తో సంబంధం లేకుండా బ్రాడ్‌కాస్టర్లు, ఎంఎస్‌ఓలపై ఒత్తిడి తీసుకొచ్చి సాక్షి ప్రసారాలను నిలిపివేయటం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ అనుకూల చానళ్లపైనా ఇదే చర్య తీసుకోవాలని సందేశం ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. పార్టీ లీగల్ సెల్ న్యాయవాది చింకా సురేష్ చంద్రయాదవ్ మాట్లాడుతూ కేబుల్ టీవీ ఖాతాదారులకు సాక్షి, మరికొన్ని చానళ్ల ప్రసారాలను అందించకపోవడంపై వినియోగదారుల కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. అంతవరకు వెళ్లాలని తాము అనుకోవటం లేదని, ఎంఎస్‌ఓలు, బ్రాడ్‌కాస్టర్లను సంప్రదించి అన్ని చానళ్లను ప్రసారం చేయాలని చెప్పారు.

అప్రజాస్వామిక వైఖరి

పార్టీ మహిళా నేత, మున్సిపల్ కౌన్సిలరు కొత్రపాటి యశోద మాట్లాడుతూ భజన చేసే చానళ్లను మాత్రమే ప్రసారం చేస్తూ, విమర్శించే వాటి ప్రసారాలను నిలిపివేయటం అప్రజాస్వామికం అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీల మోసం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, న్యాయవాది మైలా విజయ్‌నాయుడు కూడా మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, గోల్డ్ రహిమా, తాడిబోయిన రమేష్, బొంతు నరేంద్రరెడ్డి, మన్నవ ప్రభాకర్, కాకి దేవసహాయం, కొడాలి క్రాంతి, ఆవుల కోటయ్య, పెదలంక వెంకటేశ్వరరావు, కటెవరపు దేవానంద్, బండ్లమూడి నాగేశ్వరరావు, అక్కిదాసు కిరణ్, మల్లెబోయిన రాము, అమర్తలూరి సీమోను, పినపాటి రవికిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, దాట్ల మోహన్‌రెడ్డి, డి.మల్లికార్జునరెడ్డి, గుంటూరు కృష్ణ, మహిళా నేతలు తమ్మా సుజాతరెడ్డి, షేక్ జకిరా, షేక్ ఇస్రత్, ఇందిర, రెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు

- దళిత హక్కుల సాధనకు ఉద్యమించాలి
- త్వరలోనే విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర సదస్సు

చీరాల రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు అధికమయ్యాయని పలువురు దళి నేతలు పేర్కొన్నారు. దళిత హక్కుల సాధనకై కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలని అందుకు కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. 40 సంవత్సరాల దళిత ఉద్యమం అనే అంశంపై గురువారం చీరాలలోని ఎన్‌జీఓ హోమ్‌లో సదస్సు నిర్వహించారు. నాయకులు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జి.అంబేడ్కర్, దళిత హక్కుల పరిరక్షణ మితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, వీకేసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, నూకతోటి బాబురావు, చప్పిడి వెంగళరావు, గోసాల ఆశీర్వాదం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి బ్యాంకు సబ్సిడీ రుణాలు ఇవ్వడంలేదన్నారు. దళితులను కులం పేరుతో దూషించినవారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు నోటీసులు ఇచ్చి ఇంటికి పంపుతున్నారని, పైపెచ్చు బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రకులస్తులకు 10 శాతం రిజర్వేషన్లు దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్‌ను తల్లికి వందనం వంటి పథకాలకు వాడుకుంటూ దళితులను ఈ ప్రభుత్వం దగా చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎస్సీలకు 50 ఏళ్లు నిండితే పెన్షన్ ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగుతున్నా ఇద్దరు దళిత మంత్రులు ప్రభుత్వాన్ని ఏ మాత్రం ప్రశ్నించడంలేదని వారు డమ్మీలుగా మారారని పేర్కొన్నారు. వీటన్నింటికి పరిష్కారంగా త్వరలోనే దళిత ఉద్యమ భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించి ప్రతి జిల్లాలో సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చీరాలలో సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సెలక్షన్స్ రేపు

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 3.30 గంటలకు చీరాలలోని ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.విజయకుమార్, ప్రాంతీయ కోఆర్డినేటర్ ఎస్.దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బి.ప్రేమయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తమ వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 6304338205, 9490335238 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బైక్‌పై నుంచి పడ్డ వృద్ధురాలు మృతి

బల్లికురవ: బీపీతో కళ్లు తిరగటంతో బైక్‌పై కూర్చున్న వృద్ధురాలు కిందపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అందిన సమాచారం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట గొట్టిపాడు గ్రామానికి చెందిన గుంటకల గోవిందమ్మ (56) కుమారుడు నాగేంద్రబాబుతో కలసి పని నిమిత్తం మంగళవారం బైక్‌పై పల్నాడు జిల్లా నాగులవరం వెళ్లింది. సాయంత్రం తిరిగి వస్తుండగా మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో ప్రాథమిక చికిత్సకు గుంటుపల్లి పీహెచ్‌సీకి, అక్కడ నుంచి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి భర్త చిలకయ్య, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు బల్లికురవ ఎస్సై వై.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

నీరుకొండ(మంగళగిరి): మండలంలోని నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సబ్‌కలెక్టర్ భార్గవ్‌తేజలతోపాటు పలువురు అధికారులు పరిశీలించారు. గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ -2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు, ప్రో వీసీ సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డైరెక్టర్ సీఎల్ అనూప్ సింగ్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎం.పార్థసారథి, మంగళగిరి తహసీల్దార్ కే దినేష్ రాఘవ, డీఎస్‌వో చంద్రముని, డీఎంహెచ్ వో డాక్టర్ విజయలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తికి రిమాండ్

పెదకాకాని: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని వెంగళరావునగర్‌కి చెందిన కూరాకుల సత్యనారాయణ, అనూష దంపతులు తమ ఇంటిని విక్రయానికి పెట్టారు. ఇంటిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ ఇచ్చిన సత్యదేవ్ బ్యాంక్ రుణం పొందేందుకు సర్వే సర్టిఫికెట్ కోరడంతో నకిలీపత్రాన్ని ఆయన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపించారు. బ్యాంకర్లను కలిసిన ఆయన అనుమానం వచ్చి తహసీల్దార్ కృష్ణకాంత్‌కు పత్రం గురించి తెలిపారు. విచారణలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీపత్రం సృష్టించినట్లు నిరూపణ అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తుచేపట్టారు. కేసులో సత్యనారాయణను గురువారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు పెదకాకాని సీఐ స్వామి తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతల విచారణ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలను గురువారం సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు నాగమల్లేశ్వరరావు, ఎం.వి.సుబ్బారావులు విచారించారు. పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకర్రావు, పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలను వేర్వేరుగా పోలీస్‌స్టేషన్లలో విచారించి, వారి నుంచి సమాధానాలు రాబట్టి నమోదు చేసుకున్నారు. వీరి వెంట స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ బెల్లంకొండ మండల నాయకుడు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి, క్రోసూరు, అమరావతి మండల నాయకులు నర్రా వాసు, మంగిశెట్టి కోటేశ్వరరావు ఉన్నారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పక్కన మంత్రి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

దాచేపల్లి : వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు గురువారం కిసాన్ మేళా నిర్వహించారు. ఇందులో రైతుల ప్రదర్శనలను మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి పరిశీలించారు. ఆధునిక పద్ధతులను అవలంబించి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులు వ్యవసాయం చేయాలని మంత్రి రవికుమార్ చెప్పారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా తమ ప్రభుత్వం సహకారం అందించి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఏఎన్‌జీఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జి.శివన్నారాయణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఏఎన్‌జీఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పి.వి సత్యనారాయణ, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు, డీఆర్‌ఓ మురళి, ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రైతుల్లో తీవ్ర అసంతృప్తి

పంటలకు కనీసం గిట్టుబాటు ధరతో పాటు పొగాకు కొనుగోలుపై కిసాన్ మేళాలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు నుంచి హామీ వస్తుందని రైతులంతా ఎదురు చూశారు. వీటిపై సరైన స్పష్టత ఇవ్వకుండానే మేళాను ముగించడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయిలో మాచవరం పీహెచ్‌సీకి మొదటి స్థానం

రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం

మాచవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు జూన్‌లో మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించినందుకు గానూ మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో మొదటి స్థానం దక్కిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ప్రసాదరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా అందిస్తున్న వైద్య సేవల్లోనూ రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని ఆయన తెలియజేశారు. ఇటీవల పీహెచ్‌సీల పనితీరుపై వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన నివేదికలో అధికారులు గ్రేడ్‌లను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

టౌన్‌హాలుకు ఘన చరిత్ర ఉంది

బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా



తెలుగుతల్లి విగ్రహం వద్ద బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా

బాపట్ల అర్బన్: అనాదిగా ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు బాపట్ల టౌన్ హాల్ పట్టుగొమ్మగా నిలిచిందని బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా అన్నారు. టౌన్ హాలు 120వ వార్షికోత్సవ కార్యక్రమంలో గురువారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ టౌన్ హాల్‌ను 1905 జూలై 17న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ బ్రూడీ ప్రారంభోత్సవం చేశారన్నారు. టౌన్ హాల్‌కు 12 దశాబ్దాల చరిత్ర ఉందని తెలిపారు. ఎందరో జాతీయ నాయకుల ప్రసంగాలకు వేదికగా టౌన్ హాలు నిలిచిందని పేర్కొన్నారు. 1913లో ప్రథమాంధ్ర మహాసభ ఇక్కడే జరిగిందని తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు ఇక్కడే బీజం పడిందని తెలిపారు. ఇది ఎందరో కవులు, కళాకారులకు ఆలంబనగా నిలిచిందని అన్నారు. చారిత్రక టౌన్ హాల్ 120వ వార్షికోత్సవ సందర్భంగా ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, నాటి టౌన్‌హాల్ వ్యవస్థాపకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏవీ రమణారావు, రచయిత మల్లికార్జున, ఖాజీపాలెం డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ కృష్ణంరాజు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, రత్నేశ్వరరావు, మల్లేశ్వరి, సుశీలావతి, వెంకటలక్ష్మమ్మ, పద్మజ, విద్యార్థులు, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఆగదు

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రభాకరరావు



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె డివిజన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె గురువారంతో నాల్గవ రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేసిన సందర్భంగా 17 రోజులకు జీతాలు ఇతర బెనిఫిట్స్ అందిస్తామని చేసిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులందరికి వర్తింపజేసి కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రవిబాబు, కోశాధికారి రాఘవేంద్రరావు, నాయకులు శివ, రవి, శ్రీను, సుబ్బారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ముక్తేశ్వరుని సాక్షిగా ఇసుక అక్రమ తవ్వకాలు



మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం సమీపంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

రేపల్లె: సాక్షాత్తూ ముక్కంటి కనులు కప్పి కూటమి నేతలు అక్రమ ఇసుక తవ్వకాలకు బరితెగించారు. దక్షిణకాశీగా పేర్గాంచిన రేపల్లె మండలం మోర్తోట గ్రామంలో పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ సమీపంలో కూటమి నేతల కనుసన్నలలో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆలయానికి కేవలం 300 మీటర్ల దూరంలో కృష్ణమ్మ ఒడ్డున జేసీబీలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రసిద్ధిగాంచిన ముక్తేశ్వరస్వామి ఆలయానికి సాధారణ రోజులతో పాటు కార్తిక మాసంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుని కృష్ణానదిలో పుణ్యస్నానమాచరిస్తుంటారు. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉండటంతో ఇదే అదునుగా భావించిన కూటమినేత కన్నుసన్నలలో ఇసుకాసురులు జేసీబీల ద్వారా గుంతలు తవ్వి ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ప్రకృతి సంపద తరలిపోవటంతోపాటు భవిష్యత్‌లో తవ్విన ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ హుస్సేన్, మండల కో-ఆర్డినేటర్ సురేష్

క్రోసూరు: వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం అని జిల్లా కో-ఆర్డినేటర్ ఎంఏ.హుస్సేన్ తెలిపారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దూరవిద్య అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కో-ఆర్డినేటర్ చిల్కా సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్థులు పొందే సర్టిఫికెట్లకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెగ్యులర్ విద్యార్థులతో పాటు సమానమైన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 24 సంవత్సరాలు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. చదవడం, రాయడంతో పాటు ఏదొక తరగతి టీసీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఇంటర్‌కు 10వ తరగతి మార్క్స్ సర్టిఫికెట్, టీసీ, బ్యాంకు అకౌంట్ కాపీ అందజేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అయితే కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులు అయితే వైకల్యం ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. ఫీజు చెల్లింపునకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 30 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని తెలియజేశారు. వివరాలకు పని వేళల్లో మండల రిసోర్సు కేంద్రంలో, సచివాలయాల్లో, మండల కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. మీసేవ, ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. మంజుల

నరసరావుపేట: ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకునే హెచ్‌ఐవీ రోగులు ప్రతిరోజు సరైన సమయానికి వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల చెప్పారు. తన కార్యాలయం నుంచి గురువారం జిల్లా మెడికల్ అండ్ హెల్త్, ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో జూలై నాటికి చేసిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించడం ద్వారా ఆ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకోని వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. తిరిగి మందులు వాడేలా చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాడడం వల్ల వైరల్ లోడ్ పూర్తిగా అదుపులో ఉంటుందని చెప్పారు. వైరల్ లోడ్ పరీక్షలో 200 కన్నా తక్కువ కాపీలు వస్తే వారిద్వారా ఇతరులకు హెచ్‌ఐవీ వ్యాపించదని తెలిపారు. సుఖ వ్యాధులను గుర్తించి భాగస్వామి సహా పూర్తికాలం మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ శశిధర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోరుతూ రైతుల ధర్నా

- సరైన ధర నిర్ణయించడం లేదని ఆవేదన
- గుంటూరు రైతుబజార్‌లో గంటపాటు నిలిచిన విక్రయాలు

నగరంపాలెం: రైతుబజార్‌లోని రైతులు ఒక్కసారిగా ధర్నాకు దిగారు. తమకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోయారు. కొనుగోలుదారులు సైతం ఇబ్బంది పడ్డారు. కృష్ణానగర్ కుందుల రోడ్డు రైతుబజార్‌లోని రైతులు గురువారం ఉదయం ఆందోళనబాట పట్టారు. దాదాపు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గుంటూరు నగరంలోని రైతుబజార్‌లకు కూరగాయల ధరలను నిర్ణయిస్తోంది. వారు నిర్ణయించిన ధరల ప్రకారం ఆయా రైతుబజార్లల్లో విక్రయించాలి. కృష్ణానగర్‌లోని రైతుబజార్‌లో నెల రోజులుగా సరైన గిట్టుబాటు ధరలను నిర్ణయించడం లేదని పలువురు దుకాణాదారులు ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. గుంటూరు నగరంలోని వివిధ గ్రామాల నుంచి సరుకును తీసుకుని ఇక్కడికి వస్తుంటామని రైతులు తెలిపారు. 26 కిలోల టమాటా పెట్టె రూ.800 అని, ఆ పెట్టెను ఆటోలో తీసుకురావడానికి రూ.20 చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అయితే కిలో టమాటాను రూ.31లకు గురువారం నిర్ణయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 26 కిలోల పెట్టెను కిలో రూ.31 గా ధర నిర్ణయిస్తే రూ.806లని తెలిపారు. తమకు ఏం గిట్టుబాటు అవుతుందని వాపోయారు. టమాటతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరల ధరల పరిస్థితి కూడా అలాగే ఉందని తెలిపారు. దీంతో సరైన గిట్టుబాటు ధరల్లేక వ్యాపారుల వద్ద వడ్డీలకు నగదు తీసుకొచ్చి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. రైతుల ధర్నాతో కొనుగోలుదారులు ఇబ్బందులకు గురయ్యారు.